సాక్షి కరీంనగర్

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



కలెక్టరేట్‌పై ఐరాస జెండా

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్‌పై గురువారం ఐరాస జెండా ఎగిరింది. ఐక్య రాజ్య సమితి దినోత్సవం సందర్భంగా జెండాను ఏర్పాటు చేశారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



పండుగ తరువాతే కొనుగోళ్లు

జిల్లావ్యాప్తంగా సన్నవడ్ల కొనుగోళ్లకు సర్కారు చర్యలు తీసుకుంటోంది. దీపావళి పండుగ తరువాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/24.0

ఆకాశం మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ, రాత్రి సమయంలో చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వధార్ హోమ్ సందర్శన



వృద్ధురాలికి పండ్లు అందిస్తున్న సివిల్ జడ్జి వెంకటేశ్

కరీంనగర్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికారసంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ నగరంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమం, స్వధార్ హోమ్‌ను గురువారం సందర్శించారు. వృద్ధులు, దివ్యాంగులతో ముచ్చటించారు. వృద్ధులకు సరైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. స్వధార్ హోమ్‌లో ఉన్నవారితో మాట్లాడుతూ యుక్తవయసులో ఆకర్షణకు లోనై, ప్రేమగా భావించి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసి, ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ఆహార పదార్థాలు నిల్వచేసే గదులను తనిఖీ చేశారు. ఎలాంటి న్యాయపరమైన అవసరాలున్నా సంప్రదించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం వృద్ధుల, వికలాంగుల ఆశ్రమంలో, స్వధార్ హోంలో పండ్లు పంపిణీ చేశారు.

ప్రతీ విద్యార్థి ఆంగ్లంపై పట్టు సాధించాలి



సుందరగిరి పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

చిగురుమామిడి: ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా ఆంగ్లంలో మాట్లాడాలని, ఉపాధ్యాయులు అందుకు తగిన విధంగా విద్యాబోధన చేయాలని డీఈవో జనార్దన్‌రావు ఆదేశించారు. గురువారం చిగురుమామిడి మండలం సుందరగిరి జెడ్పీపాఠశాలను సందర్శించారు. విద్యార్థులు భాషపై పట్టు సాధించి భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని అన్నారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ఎస్‌ఏ–1 పరీక్షను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వి.పావని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తగ్గుతున్న పత్తి ధర



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర తగ్గుతోంది. బుధవారం క్వింటాల్‌కు రూ.7,000 పలకగా.. గురువారం రూ.250 తగ్గి గరిష్ట ధర రూ.6,750 పలికింది. మార్కెట్‌కు 172 వాహనాల్లో 1,678 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.6,000 పలికింది. గన్నీసంచుల్లో 17మంది రైతులు 32 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.6,300, కనిష్ట ధర రూ.6,000కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. సీసీఐ సంస్థ నలుగురు రైతుల నుంచి 42.95 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. గరిష్ట ధర రూ.7,195, కనిష్ట ధర రూ.7,170 పలికింది. క్రయ విక్రయాలను గ్రేడ్–2 కార్యదర్శి రాజా పర్యవేక్షించారు.

నాలుగు రోజులు సెలవులో నగరపాలక కమిషనర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ నాలుగు రోజుల పాటు సెలవులో వెళ్లారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు ఆమె సెలవు పెట్టారు. వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లినట్లు సమాచారం. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి అదనపు బాధ్యతలు అప్పగించారు.

మెడికల్ కళాశాలలో పారా మెడికల్ కోర్సులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మెడికల్ కళాశాల అనుబంధంగా 2024–25 విద్యాసంవత్సరానికి పారామెడికల్ కోర్సులు ప్రారంభించనున్నారు. డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నికల్ కోర్సు (డీఎంఐటీ)రెండేళ్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ కోర్సు (డీఏఎన్‌ఎస్) కోర్సులకు ఇంటర్మీడియట్ బైపీసీ చదివిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఎంపీసీ చదివిన విద్యార్థుల నుంచి కూడా దరఖాస్తులు తీసుకుంటారు. వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్(డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎంసీకెఎన్‌ఆర్.కామ్)లో సంప్రదించవచ్చు.

మెడి‘కిల్’ దందా!

‘ఈనెల 16న కరీంనగర్‌లోని ఓ మెడికల్ షాపులో అధికారులు తనిఖీలు చేయగా ఈఎస్‌ఐ ఆస్పత్రికి చెందిన రూ.4.87లక్షల విలువైన మందులు పట్టుబడ్డాయి. ఈఎస్‌ఐలో పనిచేసే ఓ ఫార్మసిస్టు, మెడికల్ షాపు యజమాని కుమ్మక్కై ప్రభుత్వ మందులను పక్కదారి పట్టించగా, డీసీఏ అధికారులు పట్టుకుని ఇరువురిపై కేసు నమోదు చేశారు.’

- సర్కారు మందులు.. ప్రైవేటులో విక్రయాలు
- మార్కెట్లో ఈఎస్‌ఐ మందులు
- యథేచ్ఛగా నిషేధిత డ్రగ్స్ అమ్మకాలు
- నకిలీ మందులతో ప్రమాదంలో ప్రజలు
- డీసీఏ దాడుల్లో బహిర్గతం



‘2018లో ప్రభుత్వం నిషేధించిన డ్రగ్స్‌ను నగరంలోని ఓ మెడికల్ షాపులో అమ్ముతుండగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో డీసీఏ అధికారులు పట్టుకున్నారు. నిషేధిత ఎల్‌పీ నార్స్– ఎస్‌ఐడీ డ్రగ్స్‌ను 2023లోనూ విక్రయిస్తుండడంతో పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి మెడికల్ షాపు యజమానిపై కేసు నమోదు చేశారు’.

కరీంనగర్‌టౌన్:

జిల్లాలో మెడికల్ మాఫియా రాజ్యమేలుతోంది. సుమారు వెయ్యి వరకు హోల్‌సేల్, రిటైల్ మెడికల్ దుకాణాలు ఉండగా అక్రమ దందా జోరుగా సాగుతోంది. ఉత్తర తెలంగాణలోనే అత్యధికంగా డ్రగ్స్ దందా నడిచే కరీంనగర్‌లో నిషేధిత మందులు, ప్రభుత్వ మందులు, జనరిక్ మందులు అనే తేడా లేకుండా రిటైల్‌షాపుల్లో అమ్మకాలు సాగిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఇందులో నకిలీ మందులు కూడా ఉండడంతో రోగులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

కరోనా తర్వాత ఇష్టారాజ్యంగా

కరోనాకు ముందు జిల్లాలో మెడికల్ దందా సాధారణంగానే ఉండేది. కరోనా తర్వాత ప్రజలు గూగుల్‌లో సెర్చ్‌చేస్తూ ఏ రోగానికి ఏ మందు వాడాలో తెలుసుకుని, నేరుగా మెడికల్ షాపులకు వెళ్లి మందులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో జిల్లాలో దందా పెరిగింది. మెడికల్ షాపుల నిర్వాహకులే రోగం చెబితే.. మందులు ఇచ్చేంత స్థాయికి వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నారు. ప్రజలు నేరుగా మెడికల్ షాపుకు వెళ్లి మందులు కొనుగోలు చేస్తుండడంతో జీరో దందా జోరుగా సాగుతోంది.



పట్టుబడిన ఐదు రకాల ఈఎస్‌ఐ మందులు

బిల్లులు ఇవ్వకుండా దందా

మెడికల్ షాపుల యజమానులు ఎన్ని వేల మందులు కొన్నా బిల్లులు మాత్రం ఇవ్వడం లేదు. ఎవరైనా అడిగితే తెల్లకాగితంపై రాసి ఇస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో మందుల దుకాణాల యజమానుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. కొందరు జనరిక్ మందులను అత్యధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ, ప్రభుత్వ, జనరిక్ మందులను బ్రాండెడ్‌గా అమ్మకాలు చేయడం వంటి దందా జిల్లావ్యాప్తంగా విచ్చలవిడిగా సాగుతుండగా.. అధికారులు చర్యలు చేపట్టకపోతే ప్రజలు ఆర్థికపరంగా, ఆరోగ్యపరంగా దోపిడీకి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా డ్రగ్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

మందుల దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు సాగించాలి. డ్రగ్స్ కొనుగోలు చేసినప్పుడు కచ్చితంగా బిల్లు తీసుకోవాలి. బిల్లులు ఇవ్వకపోయినా, మందుల్లో ఎలాంటి లోపాలు ఉన్నా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసులు, డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్

ధాన్యం విక్రయాలపై సందేహాలా?

- రేపు సివిల్ సప్లయ్ డీఎం, డీఎస్‌వోలతో ‘సాక్షి’ ఫోన్‌ఇన్

రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు, సన్న రకాల ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అధికారులు ఆమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దొడ్డు రకాల కొనుగోలుకు కేంద్రాలు ప్రారంభించగా సన్నాల కొనుగోలుకు కసరత్తు చేస్తున్నారు. ధాన్యం క్రయవిక్రయాలు.. తూకంలో మోసాలు, రవాణా సమస్య, తదితరాలపై రైతులు నేరుగా అధికారులతో మాట్లాడేలా ‘సాక్షి’ అవకాశం కల్పిస్తోంది. ఈ నెల 26న (శనివారం) ఫోన్‌ఇన్ ఉంటుంది. సివిల్ సప్లయ్ డీఎం రజనీకాంత్, డీఎస్‌వో నర్సింగరావు రైతుల సమస్యలకు సమాధానాలు ఇస్తారు. జిల్లాలోని రైతులు ఫోన్‌చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే సరి.



రజనీకాంత్



నర్సింగరావు

సాక్షి ఫోన్ ఇన్

ఫోన్‌ఇన్ తేదీ: 26-10-2024

సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్: 99895 75683

గ్రామీణ రోడ్లకు నిధులు

- ఉమ్మడి జిల్లాకు రూ.43.03 కోట్లు మంజూరు

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న గ్రామీణ రోడ్ల మరమ్మత్తులకు, అంతర్గత రహదారుల నిర్మాణానికి గాను రూ.43 కోట్ల 3 లక్షల 26 వేల నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ సెక్రటరీ లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ జిల్లాలో ఐదు మున్సిపాల్టీల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు రూ.2 కోట్ల 91 లక్షల 26వేలు మంజూరయ్యాయి. 304 అండర్ కన్‌స్ట్రక్షన్ రూరల్ రోడ్ల(సీఆర్‌ఆర్) పనులకు, 160 అండర్ మండల రహదారుల మరమ్మతుల(ఎంఆర్‌ఆర్) గ్రాంట్స్‌కు గాను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 56.23 కి.మీటర్లకు రూ.40 కోట్ల 12 లక్షలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నిధులు మంజూరై పనుల్లో జాప్యం జరగడం వల్ల ల్యాప్స్ అయిన పనులకు గాను నిధులను మంజూరు చేస్తూ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలం రాజారాం టు పోతారం రోడ్డుకు రూ.60 లక్షలు, రామడుగు మండలం శ్రీరాములపల్లి టు బూర్గుపల్లి వయా కారుపాకలపల్లి రోడ్డుకు రూ.2కోట్ల 50 లక్షలు, గంగాధర మండలం గర్షకుర్తి వయా కాసారం రోడ్డుకు రూ.2 కోట్ల50 లక్షలు, బోయినపల్లి మండలం నల్గొండ టు అనంతపల్లి రోడ్డుకు రూ.6కోట్లు, ధర్మపురి నియోజకవర్గం బుగ్గారం సీసీ రోడ్డు మద్దునూర్‌కు రూ.కోటి, కరీంనగర్ కాజీపూర్ ఎస్సీ కాలనీ వయా కాపువాడ, ఎరుకలవాడ రోడ్డుకు రూ.4 కోట్ల 50లక్షలు, గోపాల్‌పూర్ అప్రోచ్ రోడ్డుకు రూ.కోటి 50 లక్షలు, బొమ్మకల్ టు మల్లిఖార్జున టెంపుల్ రూ.కోటి 50లక్షలు, మొగ్దుంపూర్ ఎస్సీ కాలనీ రోడ్డుకు రూ.కోటి, బొమ్మకల్ దుర్గమ్మ టెంపుల్ రోడ్డు రూ.4కోట్లు, నాగుల మల్యాల టు నర్సింగాపూర్ రోడ్డుకు రూ.2కోట్లు, మల్కాపూర్ రోడ్డుకు



రూ.60లక్షలు, మానకొండూరు నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి సీసీ రోడ్డు, డ్రైనేజీలకు రూ.3 కోట్లు, తిమ్మాపూర్ మండలం సీసీ రోడ్డు, డ్రైనేజీలకు రూ.2కోట్లు, వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట టు ఆత్మకూరు రోడ్డుకు రూ.2కోట్లు, కథలాపూర్ మండలం చింతకుంట సీసీరోడ్డు పనులకు రూ.2 కోట్లు, వేములవాడ మండలం చెక్కపల్లి టు వట్టిముల రోడ్డుకు రూ.2కోట్ల 60 లక్షలు, బోయినపల్లి మండలం మల్కాపూర్ సీసీ రోడ్డుకు రూ.3కోట్లు, బోయినపల్లి మండలం నర్సింగాపూర్ సీసీ రోడ్డుకు రూ.5 కోట్లు, హుజూరాబాద్ నియోజకవర్గంలో కాట్నపల్లి సీసీ రోడ్డు రూ. 8 కోట్లు, వీణవంక మండలం ఇప్పలపల్లి రోడ్డుకు రూ.60 లక్షలు, వేములవాడ అర్బన్‌లో రోడ్ల మరమ్మతుకు రూ.4 కోట్లు మొత్తంగా 56.23 కి.మీటర్లకు గాను రూ.40 కోట్ల 12 లక్షలు నిధులు విడుదలయ్యాయి.

కరీంనగర్ జిల్లాకు రూ. 2.91 కోట్లు...

జిల్లాలోని ఐదు మున్సిపాల్టీలలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను మరమ్మత్తులు చేసేందుకు రూ.2 కోట్ల 91 లక్షల 26 వేలు నిధులు మంజూరయ్యాయి. కరీంనగర్ నగరపాలక సంస్థలో 21 పనులకు గాను రూ. 50 లక్షలు, కరీంనగర్ సిటీలో ఈఈ ఆర్‌అండ్‌బీ 9 పనులకు రూ.38.26 లక్షలు, కరీంనగర్ పంచాయతీరాజ్ ఇంజినీర్‌లో 25 పనులకు గాను రూ. 1.23 లక్షలు, జమ్మికుంట మున్సిపాల్టీకి రూ.20 లక్షలు, హుజూరాబాద్ మున్సిపాల్టీకి రూ.20 లక్షలు, కొత్తపల్లికి రూ.20 లక్షలు, చొప్పదండికి రూ.20లక్షల చొప్పున మొత్తంగా రూ.2కోట్ల 91 లక్షల 26వేలు మంజూరయ్యాయి.

హాస్టళ్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి సూచన


కరీంనగర్/కరీంనగర్ అర్బన్: హాస్టళ్ల నిర్వహణలో అధికారులు, సూపరింటెండెంట్లు, వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని బాలసదనం, సఖిసదన్, శిశుగృహ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. పిల్లలు, శిశువులు, వర్కింగ్ ఉమెన్స్ వివరాలను తెలుసుకున్నారు. పిల్లల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహంలో ఉండేవారి వివరాలు రికార్డు చేయాలని అన్నారు. వసతిగృహాల సూపరింటెండెంట్లు, వార్డెన్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శిశుగృహాలోని శిశువుల కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. బాలసదనం నూతన భవన నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయట ఆహారం హాస్టల్లోకి రానివ్వొద్దన్నారు. సురక్షితమైన నీటినే తాగునీటిగా అందించాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.



బాలసదన్‌ను తనిఖీ చేసి, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

క్యాంటీన్ ఏర్పాట్ల పరిశీలన

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాట్లను కలెక్టర్ పమేలా సత్పతి గురువారం పరిశీలించారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేస్తుండగా అధికారులతో కలిసి పరిశీలించారు. క్యాంటీన్‌లో పూర్తయిన ప్లాస్టరింగ్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, పెయింటింగ్ ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని సూచించారు. క్యాంటీన్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.



దీపాలంకరణ.. గజవాహన సేవ

సహస్ర దీపాలంకరణ సేవలో అర్చకులు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని యజ్ఞవరాహస్వామి 38వ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం సూర్యప్రభ వాహనసేవ, మహాసౌర ప్రయుక్త అరుణ, ఆదిత్య హృదయ పారాయణాలు, పూలంగి, అన్నకూటోత్సవం, అష్టాదశ పాద పద్మారాధన సేవలు, సాయంత్రం మహాశాంతి హోమం, సహస్రదీపాలంకరణ, గజ వాహన సేవలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.





‘గంగుల’ను పరామర్శించిన కేటీఆర్

కమలాకర్‌ను పరామర్శించి, లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేటీఆర్

కరీంనగర్: మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను గురువారం రాత్రి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. ఆయన తల్లి గంగుల లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్‌కుమార్, మేయర్ వై.సునీల్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, బాల్క సుమన్, రవీందర్‌సింగ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ

- సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: సుడా పరిధిలో రూపొందించనున్న మాస్టర్‌ప్లాన్‌పై ఈ నెలాకరులోగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మాట్లాడుతూ.. 1997 తరువాత మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరగలేదన్నారు. మాస్టర్‌ప్లాన్‌ను నగరంతో పాటు సుడా పరిధిలో త్వరితగతిన అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలులోకి వస్తే రెసిడెన్షియల్ జోన్, కమర్షియల్ జోన్, ఇండస్ట్రియల్ జోన్లుగా విభజించి ఎవరు ఏ పరిధిలోకి వస్తారో పూర్తిగా దాని ప్రకారం నిర్మాణాలకు అనుమతి లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈనెల చివరిలోపు మాస్టర్‌ప్లాన్‌పై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేల సమయం తీసుకొని ప్రజాభిప్రాయ సేకరణకు సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సుడా పరిధిలోని ప్రజలు ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్‌ఆర్‌ఎస్ ఉంటేనే ఇంటి నిర్మాణ అనుమతి పొందే అవకాశముందన్నారు. ఆగస్టు 26,2020 తరువాత వ్యవసాయ భూముల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకున్న ప్లాట్లకు ఎల్‌ఆర్‌ఎస్ చేసుకునే, భవన నిర్మాణ అనుమతులు తీసుకునే అవకాశం లేదన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కటాఫ్ తేదీ ముగిస్తే మళ్లీ అవకాశం వచ్చేంత వరకు వేచి చూడాల్సి వస్తుందన్నారు. సుడా పరిధిలో 21వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులు ముందుకు రావాలన్నారు. అంగారిక టౌన్‌షిప్‌లో వసతులకు రూ.2 కోట్లతో టెండర్ పిలిచామని, ఈ పనులు పూర్తయ్యేలోగా మిగతా నిధులు మంజూరుకు ప్రయత్నిస్తామన్నారు. నాయకులు సయ్యద్ ఖమ్రొద్దీన్, కుర్ర పోచయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దండి రవీందర్ ఉన్నారు.



మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

రోడ్ల ఆక్రమణలపై చర్యలు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వ్యాపారులకు నగరపాలకసంస్థ జరిమానా విధించింది. ట్రాఫిక్ పోలీసులతో కలిసి గురువారం నగరపాలకసంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ నగరంలోని రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలను తనిఖీ చేశారు. మెయిన్ రోడ్లతో పాటు, టవర్‌సర్కిల్,వెంకటేశ్వర ఆలయం సర్కిల్, అటవీశాఖ సర్కిల్ ప్రాంతాల్లో రోడ్లపై వ్యాపారాలు చేస్తుండడాన్ని పరిశీలించారు. దుకాణాల ఎదుట ఫుట్‌పాత్‌లు, రోడ్లపై సామగ్రి ఉంచిన వ్యాపారులకు రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు. నగరంలోని పలు చికెన్ దుకాణాలను తనిఖీ చేసిన పారిశుధ్య విభాగం అధికారులు అపరిశుభ్రంగా ఉన్న దుకాణాలకు రూ.5 వేలు, ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణాలకు రూ.2 వేలు జరిమానా విధించారు. టీపీఓ వేణు, డీఈ లచ్చిరెడ్డి, పర్యావరణ ఇంజినీర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



రోడ్లపై తోపుడు బండ్ల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్

క్లుప్తంగా

బహ్రెయిన్‌లో వేంపేట వాసి మృతి


మారంపెల్లి సుధీర్(ఫైల్)

మెట్‌పల్లిరూరల్: ఉపాధి నిమిత్తం బహ్రెయిన్ వెళ్లిన ఓ వ్యక్తి అక్కడే మృతి చెందాడు. మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన మారంపల్లి సుధీర్ (35) బహ్రెయిన్‌లో ఉరివేసుకొని మృతి చెందినట్లు అక్కడున్న పలువురు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. రెండున్నర ఏళ్ల క్రితం విదేశానికి వెళ్లిన సుధీర్ ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి తాను ఉంటున్న గదిలోనే ఆత్మహత్య చేసుకున్నాడని, అప్పుల బాధతోనే ప్రాణాలు తీసుకున్నాడని గ్రామస్తులు అంటున్నారు. సుధీర్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఇష్టం లేని వివాహం చేశారని యువకుడి ఆత్మహత్య

గంగాధర(చొప్పదండి): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన చింతలతాడెం మహేశ్ (29) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మహేశ్‌కు అతని తల్లి 6 నెలల క్రితం ఇష్టం లేని వివాహం జరిపించింది. దీంతో మనస్తాపానికి గురైన అతను బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. తల్లి ఇష్టం లేని పెళ్లి చేసినందుకే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పత్తి మార్కెట్లో నాగుపాము హల్‌చల్


నాగుపామును బంధిస్తున్న నాగార్జున

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్ యార్డులో గురువారం నాగుపాము హల్‌చల్ చేసింది. ఉదయం మార్కెట్ కార్యాలయం ఎదుట ఉన్న యార్డులోకి నాగుపాము రావడంతో రైతులు, వ్యాపారులు, అధికారులు సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. మార్కెట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే అప్పాల నాగార్జున నాగుపామును బంధించి జన సంచారం లేని ప్రదేశంలో వదిలేశాడు.

నలుగురిపై పిచ్చికుక్క దాడి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని శివంగాలపల్లిలో గురువారం పిచ్చికుక్క దాడిలో నలుగురు గాయపడ్డారు. బెజగం ధర్మయ్య, తాటికొండ వాణి, సావనపెల్లి శ్రీకాంత్, అంజిలను పిచ్చికుక్క కరిచింది. బాధితులు కోనరావుపేట పీహెచ్‌సీకి రాగా గాయాలు పెద్దవిగా ఉండడంతో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా కొన్ని రోజులుగా మండలంలో కుక్కల బెడద తీవ్రమైంది. బుధవారం కోనరావుపేటలో ఐదుగురిపై కుక్క దాడి చేసిన విషయం మరువకముందే గురువారం శివంగాలపల్లిలో నలుగురిపై దాడిచేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

డాటా ఎంట్రీ పేరుతో ఏజెంట్ల మోసం

- 'లావోస్' సైబర్‌క్రైం ఉచ్చులో తెలంగాణవాసులు
- ఆహారం దొరక్క ఇబ్బందిపడుతున్న యువకులు

జగిత్యాలక్రైం: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నకిలీ ఏజెంట్లు తెలంగాణకు చెందిన పలువురు యువకులకు కంప్యూటర్ ఆపరేటర్ డాటా పేరిట లావోస్ పంపిస్తూ అక్కడ సైబర్ నేరాల వలలో దింపుతున్నారు. సైబర్ నేరాలు చేసేందుకు నిరాకరించిన వారిపై అక్కడి వారు దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవల లావోస్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ సిటీకి చేరుకుని 10 రోజుల పాటు నరకం అనుభవించి ఎట్టకేలకు స్వదేశం చేరుకున్న వారు తమ అనుభవాలను 'సాక్షి'కి వెల్లడించారు.

థాయిలాండ్, చైనా, దావోస్ మధ్య సైబర్ అడ్డా

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులను కంప్యూటర్ డాటా ఎంట్రీ పేరుతో కొంత మంది ఏజెంట్లు నమ్మించి విజిట్ వీసాలపై మొదట థాయిలాండ్ పంపిస్తున్నారు. అక్కడి నుంచి నేరుగా బస్సులు, ట్యాక్సీల ద్వారా థాయిలాండ్ సరిహద్దుల్లో 600 బాత్‌లు (రుసుము), లావోస్ సరిహద్దుల్లో 600 బాత్‌లు (రుసుము) చెల్లిస్తే ఇమిగ్రేషన్ వారు ఆ దేశానికి అనుమతిస్తున్నారు. అక్కడికి చేరుకున్న తర్వాత కొంత మంది బినామీ పేర్లు పెట్టుకుని వచ్చి ఇక్కడి ఏజెంట్లు పంపించిన ఫొటోల ఆధారంగా నిరుద్యోగ యువతను గుర్తించి, వారి పాస్‌పోర్టులు తీసుకుని సైబర్ ఉచ్చులో దింపుతున్నారు. ఆ పనిని నిరాకరించిన వారిని పట్టణ సరిహద్దుకు తీసుకెళ్లి కంటైనర్‌లో పడేసి చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు బాధితులు వాపోయారు.

సైబర్ నేరాలకు అడ్డా గోల్డెన్ ట్రయాంగిల్ సిటీ..

సైబర్ నేరాలకు పాల్పడే చాలా మంది చైనీస్‌లు లావోస్‌లోని గోల్డెన్‌ట్రయాంగిల్ సిటీని అడ్డాగా ఎంచుకుని తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. తమ కార్యకలాపాలు కొనసాగే చోట పనిచేసే యువతీ, యువకులపై కూడా సీసీకెమెరాల నిఘాతో పర్యవేక్షిస్తుంటారు. వారి పర్యవేక్షణలో ఏదైనా పొరపాట్లు చేస్తే కఠినంగా శిక్షించడంతో పాటు, చిత్రహింసలకు గురిచేస్తుంటారు.

చైనీయుల పేరుతో ఐడీలు..

ఇక్కడి నుంచి లావోస్‌కు చేరుకున్న యువతీ, యువకులకు చైనీయుల పేరుతో ఐడీలు ఇస్తుంటారు. అమ్మాయిల పేరుతో ప్రొఫైల్స్ తయారుచేసి అందమైన అమ్మాయిల ఫొటోలు పెట్టి వీరి ద్వారా ఫోన్లతో సైబర్ నేరాలకు పాల్పడేలా శిక్షణ ఇచ్చి నేరాలు చేయిస్తున్నారు.

స్వదేశం రావాలంటే రూ.2.50 లక్షలు..

లావోస్ చేరుకున్న యువతీ, యువకులు ఎవరైనా తమకు పని నచ్చడం లేదని, తాను పనిచేయలేనని మొండికేస్తే రూ.2.50 లక్షలు చెల్లిస్తేనే వారికి పాస్‌పోర్టులు ఇస్తున్నారు. డబ్బులు చెల్లించని వారిని తీవ్ర చిత్రహింసలకు గురిచేస్తుండటంతో వారు ఎట్టకేలకు సైబర్‌క్రైం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

ఆహారం కోసం తిప్పలు

అక్కడ పనిచేస్తున్న వారికి సరైన సమయంలో ఆహారం దొరక్క నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిచేయని వారికి మాత్రం తిండి, నీరు దొరకడం కష్టంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో ఆహారం కోసమైనా వారు చెప్పిన పని చేయక తప్పడం లేదని బాధితులు వాపోయారు.


లావోస్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ సిటీ సైబర్‌క్రైం అడ్డా భవనం ఇదే

మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో పటిష్ట భద్రత

- మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో అలర్ట్
- మూడు రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశం


హెలికాప్టర్‌తో తరలివెళ్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్, పోలీసు అధికారులు

గోదావరిఖని(రామగుండం): మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల కట్టడికి పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని మూడు రాష్ట్రాల పోలీసు అధికారులు నిర్ణయించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులతో గడ్చిరోలి ఎస్పీ క్యాంపు ఆఫీస్‌లో డీజీపీ అంకిత్‌గోయల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసమావేశానికి రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి చర్చించారు. ముఖ్యంగా మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సంబంధిత సమాచారాన్ని పరస్పరం చేరవేసుకోవాలని నిర్ణయించారు. ఫలితంగా మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరమవుతుందన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని తీర్మానించారు. నేరాల కట్టడి, కేసుల విషయంలో ఒకరికొకరు సహకరించుకుందామన్నారు. సమావేశంలో ఆపరేషన్స్ డీజీపీ అజయ్ శర్మ, కళ్యాణ్ ఎలేసెల, మొహల మన్సూర్, నీలోత్పల్, నూరుల్ హసన్, భాంద్ర, ముమ్మక్క సుదర్శన్, గోరక్ బామరె, గొండియా కిరణ్‌కారే, రాబిన్సన్ గురియా, దినేశ్‌సింహ్, ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసులు, భూపాల్‌పల్లి ఎస్పీ కిరణ్‌కారే, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జూడోలో ఒలింపిక్స్‌స్థాయికి ఎదగాలి

- రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి


గోల్డ్‌మెడల్ సాధించిన తేజ వర్షిణినిని అభినందిస్తున్న జనార్దన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: సీబీఎస్‌ఈ జాతీయస్థాయి జూడో పోటీల్లో బంగారు పతకం సాధించినట్లే భవిష్యత్‌లో ఒలింపిక్స్‌స్థాయికి ఎదగాలని రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి సూచించారు. జార్ఖండ్‌లోని సలజా గోల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఈ నెల 6 నుంచి 11వరకు జరిగిన సీబీఎస్‌ఈ నేషనల్ జూడో చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన చిన్నారి ఎం.తేజవర్షిణిని గురువారం అభినందించారు. అండర్‌–14 విభాగంలో 23కేజీల కేటగిరీలో బంగారు పతకం సాధించడం గర్వకారణం అన్నారు. కోచ్ సత్యనారాయణ అభినందించారు. పాఠశాల చైర్మన్ పొల్సాని సుధాకర్‌రావు, అకడమిక్ డైరెక్టర్ లలితకుమారి, ప్రిన్సిపాల్ రేణుక, చిత్తరంజన్ మహాపాత్ర, వైస్ ప్రిన్సిపాల్ ప్రశాంత్, శ్రీధర్, రమణ, సుధాకర్, మహేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

తమ్ముడి పేరిట భూ రిజిస్ట్రేషన్ చేయించారని..

- కుటుంబసభ్యులతో కలిసి ఇద్దరు సోదరుల ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నం చేసిన బాధితులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): తండ్రి తన పేరిట ఉన్న వ్యవసాయ భూమిని తమ్ముడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారని ఇద్దరు సోదరులు కుటుంబసభ్యులతో కలిసి ఆత్మహత్యాయత్నం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన అంబరగొండ రాములకు ముగ్గురు కుమారులు సంజీవరావు, శ్రీనివాస్, తిరుపతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తనకున్న 21 ఎకరాల వ్యవసాయ భూమిలో మొదటి ఇద్దరు కుమారులకు ఐదెకరాల చొప్పున, కూతుళ్లకు రెండెకరాల చొప్పున, ఊరికి దూరంగా ఉన్న పొలానికి వెళ్లేందుకు దారి లేదని చిన్న కుమారుడికి 6 ఎకరాల భూమిని 20 ఏళ్ల క్రితం పట్టా చేయించాయి. ఒక ఎకరం భూమిని తన పేరిటే ఉంచుకున్నాడు. గురువారం ఆ భూమిని కూడా తమ్ముడు తిరుపతి పేరిట పట్టా చేయిస్తున్నాడని తెలుసుకొని, మొదటి, రెండో కుమారులు తమ కుటుంబసభ్యులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అక్కడే క్రిమిసంహారక మందు తాగేందుకు ప్రయత్నించగా సిబ్బంది అడ్డుకొని, పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులకు నచ్చజెప్పి, ఠాణాకు తీసుకెళ్లారు. ఈ విషయమై తహసీల్దార్ రాణిని వివరణ కోరగా అంబరగొండ రాములు తన చిన్న కుమారుడికి భూమిని సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

గంగాధర(చొప్పదండి): ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్, గంగాధర ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయించేందుకు బుధవారం రాత్రి గంగాధర వస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు ఆ గ్రామ శివారు నుంచి రామడుగు మండలంలోని షానగర్ వెళ్లే దారిలో కాపుకాశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న కరీంనగర్ పట్టణా నికి చెందిన ఎండీ.యాసిన్, కొత్తపల్లి ఆదిత్య, వాజోది పాషాలను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద కిలో గంజాయి లభ్యమైంది. విచారణలో వారు నాగపూర్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి, తాము వినియోగించడంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఏడాదిగా ఇలా చేస్తున్నామని చెప్పడంతో ఆ ముగ్గురినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండల పరిధిలోని అల్ఫోర్స్ టెక్నో పాఠశాలకు చెందిన ఎస్.నిశితల్ 8వతరగతి, డి.సహస్రరెడ్డి 9వతరగతి, ఎండీ.ముక్రాం 8వతరగతి, హేమంత్ 9వ తరగతి విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి గురువారం అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

నకిలీ ఫోన్ వస్తువుల అమ్మకాలపై కేసు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: నగరంలో ఆపిల్ ఫోన్‌కు సంబంధించిన వస్తువులు నకిలీవి అమ్ముతున్నారన్న సమాచారంతో పలు మొబైల్ షాపులపై దాడులు చేసి, కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆపిల్ ఫోన్ కంపెనీ సింబల్‌తో నకిలీ ఎయిర్ బర్డ్స్, పవర్ ఎడాప్టర్, లైటింగ్ కేబుల్, బ్యాక్‌కవర్లు అమ్ముతున్నారని ఆపిల్ కంపెనీ ఏజెన్సీ ఫిర్యాదు చేయడంతో నగరంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో ఉన్న పంచరతన్ మార్కెటింగ్, శ్రీజీ మొబైల్ స్పేర్‌పార్ట్స్, మహాలక్ష్మి సెల్ వరల్డ్, చాముండా మొబైల్ షాప్‌పై దాడులు చేశారు. నకిలీ వస్తువులు సీజ్‌చేసి, యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

గంగారెడ్డి హత్యపై అనుమానితుల విచారణ

- పలువురి సెల్‌ఫోన్లు స్వాధీనం
- కత్తి కోసం మూడు గంటల గాలింపు

జగిత్యాలక్రైం: కాంగ్రెస్ నాయకుడు మారు గంగారెడ్డి హత్యపై అనుమానితులను పోలీసులు విచారిస్తున్నారు. నిందితుడు వెల్లడించిన వివరాల మేరకు హత్యకు ఉపయోగించిన కత్తి గురించి గురువారం ఉదయం గ్రామ శివారులోని కంది చేలులో గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే గ్రామానికి చెందిన కొంత మంది అనుమానితులను బుధవారం రాత్రి విచారించిన పోలీసులు వారి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వదిలిపెట్టినట్లు సమాచారం. గురువారం ఉదయం కూడా వారిని విచారించినట్లు సమాచారం. ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడితోపాటు, అతడితో సంబంధాలున్న వారి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

పండుగ తర్వాతే సన్నాల కొనుగోళ్లు

- 33 రకాలకే బోనస్..
- మార్గదర్శకాలు జారీ



కరీంనగర్ అర్బన్: సన్న రకాలకు రూ.500ల బోనస్‌పై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. దొడ్డు, సన్నరకాలను వేర్వేరుగా కొనుగోలు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. సన్న ధాన్యానికి ఏ గ్రేడ్ రకం మద్దతు ధర రూ.2,320తో పాటు క్వింటాల్‌కు రూ.500 అదనంగా ఇవ్వనున్నారు. జిల్లాలో 1,18,500 ఎకరాల్లో సన్నరకం సాగవగా 3.60లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రానుంది. సీడ్ మిల్లులకు పోనూ 1.80లక్షల క్వింటాళ్లు మార్కెట్‌కు వస్తుందని అధికారుల అంచనా. దీపావళి పండగ తరువాతే కొనుగోళ్లు ప్రారంభించే అవకాశముండగా ఇప్పటికే మిల్లర్లు పోటీపడి క్వింటాల్‌కు రూ.3వేలకు పైగా ఖరీదు చేస్తున్నారు. మండలానికి నాలుగు లేదా ఐదు సన్న రకాల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సమాచారం.

ఈ సన్న రకాలకే బోనస్

33 రకాల సన్న రకాలకు మాత్రమే బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు వివరించారు. బోనస్ ఇవ్వడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ధాన్యం గింజ పొడవు, వెడల్పు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అనేది తెలుసుకోవడానికి ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద ఈ సారి మైక్రో మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పొడవు 6 మిల్లీ మీటర్ల కన్నా తక్కువ వెడల్పు రెండు మిల్లీమీటర్ల కన్నా ఎక్కువ కాకుండా ఉండాలి. ధాన్యం తేమ 17 శాతానికి మించనప్పుడు మాత్రమే కొనుగోలుకు తీసుకోవాలని నిర్దేశించారు. సిద్ధి(డబ్ల్యూజీఎల్ 44), కంపసాగర్ వరి–1 (కేపీఎస్ 2874), సాంబమసూరి(బీపీటీ 5204), జగిత్యాల్ వరి–3(జేజీఎల్ 27356),జగిత్యాల్ వరి–2(జేజీఎల్ 28545), వరంగల్ సాంబ(డబ్ల్యూజీఎల్ 14), వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్32100), జగిత్యాల్ మసూరి (జేజీఎల్11470), పొలాస ప్రభ (జేజీఎల్ 384), కృష్ణ (ఆర్ఎస్ఆర్ 2458), మానేరు సోనా (జేజీఎల్ 3828), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), వరంగల్ వరి–1119, కూనరం వరి–2 (కేఎన్ఎం 1638), వరంగల్ వరి–2 (డబ్ల్యూజీఎల్ 962), ఎంటీయూ 1271, రాజేంద్రనగర్ వరి 4 (ఆర్ఎన్ఆర్ 21278), సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465), కూనరం వరి– 1 (కేఎన్ఎం 733), జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798), జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844), కరీంనగర్ సాంబ (జేజీఎల్ 3855), అంజన (జేజీఎల్ 11118), నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449), ప్రత్యుమ్న (జేజీఎల్ 17004), శోభిని (ఆర్ఎస్ఆర్ 2354), సోమ్నాథ్ (డబ్ల్యూజీఎల్ 347), ఆస్ఆర్ఆర్ 31479(పీఆర్సీ), కేపీఎస్ 6251 (పీఆర్సీ), జేజీఎల్ 33124 (పీఆర్సీ), హెచ్ఎంటీ సోనా, మార్టేరు సాంబ (ఎంటీయూ 1224), మార్టేరు మసూరి (ఎంటీయూ 1262) రకాలకు మాత్రమే బోనస్ ఇవ్వనున్నారు.

సన్నాల గుర్తింపు ఇలా

సన్న ధాన్యంపై అనుమానం ఉంటే కేంద్రానికి కేటాయించిన మైక్రోమీటర్ ద్వారా రైతు, ఏఈవో, కేంద్ర నిర్వాహకుల సమక్షంలో ధాన్యం గింజను కొలుస్తారు. వడ్లను మిల్లులకు తరలించే క్రమంలోనూ గన్నీ సంచులపై సన్నరకం అయితే ×ఎస్, దొడ్డు రకం అయితే ×డీ అని గుర్తులు పెడతారు. ధాన్యం పొట్టు తీసి పొడవు, వెడల్పు నిష్పత్తి లెక్కిస్తే 3 కన్నా తక్కువ ఉంటే దొడ్డురకం, ఎక్కువ ఉంటే సన్నరకం ధాన్యంగా గుర్తిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, ఏఈవోలు, ఐకేపీ ఏపీఎంలు, పీఏసీఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీఈవో, మెప్మా అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా సన్నాల సాగువిస్తీర్ణం(ఎకరాల్లో)

చొప్పదండి	1,916
గంగాధర	1,198
రామడుగు	1,235
ఇల్లందకుంట	10,347
హుజూరాబాద్	21,664
జమ్మికుంట	10,837
సైదాపూర్	7,767
వీణవంక	17,918
కరీంనగర్ రూరల్	2,252
కొత్తపల్లి	449
చిగురుమామిడి	828
గన్నేరువరం	355
మానకొండూరు	17,933
శంకరపట్నం	20,421
తిమ్మాపూర్	3,394

రాజన్న హుండీ ఆదాయం రూ.1.46కోట్లు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్నకు హుండీల ద్వారా రూ.1.46కోట్ల ఆదాయం సమకూరింది. దాదాపు నెల రోజుల తర్వాత హుండీలను గురువారం లెక్కించారు. నగదు రూ.1,46,16,253, బంగారం 211 గ్రాములు, వెండి 9.900 కిలోలు వచ్చినట్లు రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవోలు, ఆలయ పర్యవేక్షకులు, శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


నగదు లెక్కిస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శంకర్ (ఫైల్)

రామగుండం: అంతర్గాం మండలం మద్దిర్యాలకు చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. మద్దిర్యాలకు చెందిన మాటేటి పెద్దరాములు–మల్లమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా అందరూ వివాహితులే. చిన్న కుమారుడు మాటేటి శంకర్(35). ఇతడికి భార్య శైలజ, 8, 5 ఏళ్ల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సెంట్రింగ్ కూలీ పనులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఇప్పటివరకు తల్లిదండ్రులు నివసించే ఇంటిలోనే ఇరుకైన గదుల్లో కుటుంబంతో కలిసి ఉండగా తండ్రి కుమారులకు పంచి ఇచ్చిన గుంట స్థలంలో మూడునెలల క్రితం సొంతింటి నిర్మాణానికి పూనుకున్నాడు. ఈక్రమంలో బుధవారం ఇంటి నిర్మాణ సామగ్రి తీసుకువచ్చేందుకు ద్విచక్ర వాహనంపై తన బావ పోచయ్యతో కలిసి మంచిర్యాలకు వెళ్లి సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. హాజీపూర్ సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో శంకర్ అక్కడికక్కడే మృతిచెందగా, పోచయ్యకు తీవ్రగాయాలయ్యాయి. సొంతింటి కల నెరవేరకుండానే శంకర్ మృత్యు ఒడికి చేరాడు. సమాచారం తెలిసిన మరుక్షణమే మృతుడి భార్య స్పృహ కోల్పోయి కుప్పకూలిపోయింది. సౌమ్యుడిగా పేరున్న శంకర్ మృతిపై గ్రామస్తులు కన్నీంటి పర్యంతమయ్యారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సతీమణి మనాలిఠాకూర్ గురువారం శంకర్ అంతిమయాత్రలో పాల్గొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. బాధిత చిన్నారుల పోషణ భారాన్ని తానే చూసుకుంటానని హామీ ఇస్తూ వారికి అప్పటికప్పుడు ఆర్థికసాయం అందజేశారు.

చిట్టీల వ్యాపారి అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని గోవిందుపల్లికి చెందిన చిట్టీల వ్యాపారి గాండ్ల వెంకన్నను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రభుత్వ అనుమతి లేకుండా విజయలక్ష్మి అనే ఫైనాన్స్ పెట్టాడు. అధిక వడ్డీలకు ఫైనాన్స్ ఇచ్చాడు. ఇలా పట్టణంతోపాటు, వివిధ గ్రామాలకు చెందిన 60 మంది నుంచి డబ్బులు తీసుకుని ఏడాది క్రితం పరారీ అయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రూ.5లక్షలకే అగ్రికల్చర్ సీట్లు

- స్పెషల్ కోటా ప్రకటించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం
- ఆన్‌లైన్ దరఖాస్తులకు నవంబర్ 1 చివరి తేదీ


పొలాస వ్యవసాయ కళాశాల

జగిత్యాలఅగ్రికల్చర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయంతోపాటు కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో రూ.5 లక్షలకే బీఎస్సీ అగ్రికల్చర్, లేదా బీఎస్సీ హార్టికల్చర్‌లో సీట్లు పొందే అవకాశాన్ని వర్సిటీ అధికారులు కల్పించారు. ఇప్పటివరకు అగ్రికల్చర్, హార్టికల్చర్‌లో సీట్లు పొందేందుకు కన్వీనర్ కోటాతోపాటు 'ఎప్‌సెట్' ర్యాంకుల ఆధారంగా సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద రూ.10లక్షలకు సీట్లు ఇచ్చేవారు. వర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా అల్దాస్ జానయ్య రావడం.. సామాన్యులకు వ్యవసాయ విద్య అందాలనే ఉద్దేశంతో స్పెషల్ కోటా సీట్లలో కొన్ని మార్పులు చేశారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసి, ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

స్పెషల్ కోటా కింద 465 సీట్లు

సెల్ఫ్ ఫైనాన్స్ కోటా తీసేయడంతోపాటు దానికున్న రూ.10 లక్షల ఫీజును స్పెషల్ కోటాగా మార్చి రూ.5లక్షలుగా పెట్టారు. తాజా నోటిఫికేషన్ ప్రకారం బీఎస్సీ అగ్రికల్చర్‌లో 401 సీట్లు, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్‌లో 5 సీట్లు, బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో 5 సీట్లు, బీఎస్సీ హార్టికల్చర్‌లో 54 సీట్లను కొత్తగా చేర్చారు. గతంలో మొత్తం డబ్బులు ఒకే సారి చెల్లించాల్సి ఉండగా.. మార్చిన నిబంధనల ప్రకారం సెమిస్టర్‌కు రూ.62,500 చొప్పున నాలుగేళ్లపాటు చెల్లిస్తే సరిపోతుంది. రైతుపిల్లలు, నాలుగేళ్లపాటు నాన్ మున్సిపల్ ఏరియాలో చదివిన విద్యార్థులకు కొంత మేర రిజర్వేషన్ ఉంటుంది.

వచ్చేనెల ఒకటి గడువు

స్పెషల్ కోటా దరఖాస్తులకు నవంబర్ 1 గడువుగా విధించారు. ఆన్‌లైన్ దరఖాస్తులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సీట్లను బైపీసీ చదివి.. తెలంగాణ ఎప్‌సెట్–2024 ర్యాంకుల ఆధారంగా మాత్రమే భర్తీ చేస్తారు. ఈ సీట్లను కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ కళాశాలల్లో భర్తీ చేస్తారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ వర్సిటీ వెబ్‌సైట్ పీజేటీఎస్ఏయూను సంప్రదించవచ్చు.

అప్పల బాధ.. కోర్టు కేసు..

- ఆత్మహత్య చేసుకున్న సింగరేణి కార్మికుడు


నర్సయ్య(ఫైల్)

గోదావరిఖని(రామగుండం): అప్పుల బాధ ఒకవైపు, కొనుగోలు చేసిన భూమి కోర్టు కేసులో చిక్కుకోవడం మరోవైపు కార్మికుని ప్రాణాల మీదకు తెచ్చాయి. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. స్థానిక విఠల్‌నగర్‌లో ఉంటూ ఓసీపీ–3లో డంపర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మాదంశెట్టి నర్సయ్య(58) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడేళ్ల క్రితం కరీంనగర్ బైపాస్‌లో భూమి కొనుగోలు చేశాడు. అయితే ఆభూమి కొనుగోలు సమయంలో రూ.20లక్షలు అప్పు చేశాడు. అదే సమయంలో అట్టి భూమిపై వివాదం ఏర్పడటంతో కోర్టు చుట్టూ తిరుగుతున్నాడు. అప్పుల భారం పెరగడంతో పాటు, స్థలం వివాదంలో ఉండటంతో మనస్తాపానికి గురైన నర్సయ్య బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు రాకేశ్ ఉన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



● పుప్పొడి నేత

పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే!
వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే!
అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి.
అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను ‘పరాగ మంజరి’గా మనకు పరిచయం చేస్తున్నది.
‘దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను’ అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..

‘‘పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్టుకు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకు రాగలిగాను.

లక్షలాది మోడల్స్

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లి పాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్క జొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటిన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

పేటెంట్ హక్కు

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్



శివాని నేత

ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్ల భామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే ‘పరాగ మంజరి’ మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం’’ అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
‘సాక్షి’ ఫీచర్స్ ప్రతినిధి

లక్ష ప్యాటర్న్స్

ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.



– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ



మన్నిదా బాను

ప్రాణం నిలిపి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజీ సెంటర్లో పెద్ద ఆక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు డీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్ళేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సెన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! ‘మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..’ అని ఉండేవి.

‘వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు’ అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్ళగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు ‘తగిన శిక్ష’ ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. ‘నేను చేసింది ఏముందీ..!’ అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.

స్త్రీ శక్తి



రీనా వర్గీస్

ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై–రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్టులు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్టులకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్టుల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో–పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది.

తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

తాళపత్ర కళ



బాల త్రిపుర సుందరి





అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికెట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరి కొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.



పనిలోనే ఆనందం

‘‘మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?’’ అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగిపోయారామె.



– వీఎమ్ఆర్
ఫోటోలు: ఎస్ఎస్ ఠాకూర్

సూజీ బ్రెడ్

హెల్దీ డైట్



కావలసినవి: బొంబాయి రవ్వ – ఒకటిన్నర కప్పులు; ఇన్‌స్టంట్ ఈస్ట్ – టీ స్పూన్; చక్కెర పొడి– టేబుల్ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; పాలు – 3 టేబుల్ స్పూన్లు; నీరు – అర కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్లు; వెన్న – టీ స్పూన్; సీడ్స్ – 3 టేబుల్ స్పూన్లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

తయారీ

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి, పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అర గంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒంటె బుక్ చేయాలి ఓటిపి నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో
ఆటోనో స్కూటరో కారో
బుక్ చేయొచ్చు. వస్తుంది.
కాని ఒంటెను బుక్ చేయొచ్చా?
దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు
ఎడారిలో తప్పిపోయారు.
ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు.
ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు.
ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న
ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు ‘మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం’ అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి ‘ఇది భలే ఉంది’ అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. ‘ఓటీపీ నంబర్ ఎంత?’, ‘దుబాయ్‌లో అంతే’, ‘నంబర్ ప్లేట్ ఎక్కడ’... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. ‘జెట్‌సెట్ దుబాయ్’ అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటె సర్వీస్‌ను ఇవ్వదు. కాని ‘ఏటీవీ’ (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైక్‌లు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుండనిపించింది.

బ్యూటిప్స్

మెరిసే మేని చాయను కాపాడుకోవాలంటే..

- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.



- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.